క్లుప్తంగా

సివిల్ సర్వీసెస్ మహిళా వాలీబాల్ కెప్టెన్‌గా శ్రీలత



కవాడిగూడ: కేరళ త్రివేంద్రంలో ఈనెల 21 నుంచి 26 వరకు జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ మహిళా వాలీబాల్ జట్టుకు వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.శ్రీలత కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె కవాడిగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

స్టీల్ బ్రిడ్జి పనులు వేగవంతం

చిక్కడపల్లి: లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి వీఎస్టీ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులు వేగంగా నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఈఈ బి.గోపాల్ వివరించారు. అదివారం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకు వాహనాల రాకపోకలను నియంత్రించడంతో పనులు వేగం పుంజుకున్నాయన్నారు. ఈ రెండు చౌరస్తాల మధ్యలో ఉన్న షాప్‌లు నివాసాలకు ఇబ్బందులు కలగకుండా గడర్ ఎరెక్షన్ స్లాబ్ పనులు కొనసాగుతున్నాయన్నారు. మంత్రి కేటీఆర్ సూచనల మేరకు మే నెలాఖరుకు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా కృషి చేస్తున్నామన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. పద్మకాలనీలో శ్రీకర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేయగా.. బొమ్మల సతీష్‌తో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. అనుభవజ్ఞులైన డాక్టర్ల బృందం ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. నరేష్, అరవింద్, వంశీ, సుదర్శన్‌గౌడ్, కాలనీ వాసులు సందీప్, శ్రీనివాస్, సతీష్, శ్రీకర ఆసుపత్రి అడ్మిన్ ఇన్‌చార్జ్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

కవితా రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి

చిక్కడపల్లి: కవితారచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి అన్నారు. కామన్ డయాస్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కాన్ఫరెన్స్‌హాల్‌లో బాలగాధరయ్య రచించిన జాషువా కవన జిగీష కవితాసంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువకవులు మంచి రచనలు చేస్తున్నారని సీనియర్ కవుల దారిలోనూ వారు నడుస్తూ.. సమాజాన్ని మరింత ప్రభావితం చేసే రచనలు చేస్తున్నారన్నారు. పలువురికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. జర్నలిస్ట్ జయసూర్య, ప్రభుత్వ సహాయ కార్మిక అధికారి డాక్టర్ నీలిమకృష్ణమూర్తి, తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్ ఆచారి, కనకాచారి, కవయిత్రి శైలజామిత్ర, శంకరస్వామి, రవికుమార్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

- రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి..



కాచిగూడ: రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి (50) శుక్రవారం రాత్రి రైలు ఎక్కుతుండగా జారికిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. శనివారం మృతి చెందాడు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చొక్కా, బుడిద రంగు ఫ్యాంట్ ధరించినట్టు సమాచారం. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే 8143807592 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: అనారోగ్యంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బిక్షాటన చేసుకునే గుర్తు తెలియని వ్యక్తి (50) కాచిగూడ రైల్వే స్టేషన్ పార్కింగ్ సమీపంలో చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య లోపం ప్రజలకు శాపం !



చెప్పల్‌బజార్‌లో మురుగు, వ్యర్థాలు ఇలా..



ట్రాన్స్ ఫార్మర్ వద్ద ప్రమాదకరంగా పారేసిన వ్యర్థాలు

కాచిగూడ: పారిశుద్ధ్య లోపం ప్రజలకు శాపంగా మారింది. ఎప్పటికప్పుడు చెత్త కుప్పలను తొలగించకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిప్తీరియా, డెంగీ, మలేరియా, విష జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

- కాచిగూడ డివిజన్‌లో ఎటు చూసినా చెత్తే దర్శనమిస్తోందని స్థానికులు చెబుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- డివిజన్ మొత్తం చెత్త కుండీని తలపిస్తోందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు వాపోతున్నారు.
- పలు బస్తీల్లో చెత్త, చెదారాలను శుభ్రం చేయకపోవడంతో రోడ్లే డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. బర్కత్‌పుర, లింగంపల్లి, నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్, తదితర ప్రాంతాల్లో చెత్తను రోడ్లపైనే వేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు దుర్గంధంగా మారాయి.
- ఏఎంహెచ్ఓ పనితీరుపై పలువురు తీవ్రంగా మండిపడుతున్నారు. చెత్త తరలింపుపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోతోందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డివిజన్‌లో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వాన్నంగా మారడంతోనే ఈ దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన ఏఎంహెచ్ఓ పర్యవేక్షణ..

- ఏఎంహెచ్ఓల పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏఎంహెచ్ఓ, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ జవాన్, కామాటీలు, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఎస్ఎఫ్ఏలు, కాంట్రాక్టు పారిశుద్ధ్య సిబ్బంది, కార్మికులు విధి నిర్వహణలో ఉన్నా.. వ్యర్థాలను తొలగించిన దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఎక్కడికక్కడే చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి.

అధికారులు స్పందించాలి..

పేరుకుపోయిన చెత్తతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే ప్రజల ప్రాణాలకే ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జ్వరం, జలుబు దగ్గు..

ఇప్పటికే చాలా మంది ప్రజలు దగ్గు, జలుబు, జ్వరం రుగ్మతలతో సతమతమవుతున్నారు. 4-5 ఇళ్లలో ఒకరు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి పరిసరాల అపరిశుభ్రతే కారణమని తెలిసినా.. పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మరికొద్ది రోజులు కొనసాగితే రోగాల భారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



బర్కత్‌పుర బస్‌డిపో రోడ్డు పక్కన..

తెలంగాణ ప్రజలు బీజేపీ వైపే : కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జి.కిషన్ రెడ్డి

కాచిగూడ: తెలంగాణలో యావత్ ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని తాజాగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపు ఫలితాలే ఈ విషయాన్ని రుజువు చేశాయని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం బర్కత్‌పురలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అరాచక కుటుంబపాలనకు ముగింపు పలకాలన్నారు. దీనికి బీజేపీ కార్యకర్తలు క్రమశిక్షణ గల సైనికుల వలే పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వంతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని రాష్ట్రం కూడా అభివృద్ధి చెందాలంటే ఇక్కడ బీజేపీని గెలిపించాలన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, చిట్టి శ్రీధర్, ఏ.సూర్యప్రకాష్ సింగ్, సంతోష్, అరవింద్, సుభాష్ పటేల్, మురళి, అనిల్, ఆనంద్, రాము, దయానంద్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన వాయిద్య కళాకారులు..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రెండు తెలుగు రాష్ట్రాల్లో సంగీత నాటక అకాడమీ హైదరాబాద్‌లో నిర్మించాలని దీనికి పదెకరాల స్థలాన్ని హైదరాబాద్‌లోనే ఇవ్వాలని సీఎం కేసీఆర్‌కి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ రాయడాన్ని హర్షిస్తూ.. ఆదివారం జాతీయ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు ఎల్.వి.చెన్నరావు ఆధ్వర్యంలో కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంగీత వాయిద్య కళలు, జానపదాలు, లలిత కళలు, నాటక రంగం, శాస్త్రీయ నృత్యం తదితర కళల గురించి వివరించి లేఖ రాయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రముఖ కళాకారులు నర్సింహ్మారావు, అయ్యన్న శ్రీనివాస్, నారాయణ, గోవింద్, భాస్కర్ తదితరులున్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి సైనికులుగా పనిచేయాలి'



ఆత్మీయ సమ్మేళనంలో శ్రీధర్‌చారి, అహ్మద్‌లను సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి సైనికులుగా పని చేయాలని అప్పుడే ప్రజల్లో ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని వైఎస్ఆర్ పార్కు వీధిలో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు అహ్మద్‌తో పాటు కాలనీ వాసులు శ్రీధర్‌గౌడ్, ప్రేమలతారెడ్డిలను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు స్థానికులు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి హరిబాబుయాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకులు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, రజనీ, సీనియర్ నాయకులు శివముదిరాజ్, గోరఖ్‌నాథ్, డివిజన్ మాజీ అధ్యక్షులు భిక్షపతియాదవ్, డివిజన్ ఎస్సీసెల్ అధ్యక్షుడు సదా, నాయకులు శంకర్‌ముదిరాజ్, శ్రీనివాస్, రవియాదవ్ తదితరులున్నారు.

ఆర్టీసీని విస్తరించి బలోపేతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో రోడ్డు రవాణా సంస్థను విస్తరించి బలోపేతం చేయాలని టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.ఎస్.రావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రవాణా రంగాన్ని దెబ్బతీస్తుందని మోటర్ వెహికిల్ సవరణ చట్టం – 2019ని అమలులోకి తెచ్చి ఆర్టీసీలకు రాజ్యాంగం కల్పించిన రక్షణను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. స్టేజీ క్యారేజీ, కాంట్రాక్టు క్యారేజీ పర్మిట్‌ల స్థానంలో నేషనల్ పర్మిట్ వ్యవస్థను ముందుకు తీసుకొచ్చి ప్రైవేటు బస్సుల అక్రమ రవాణాను సక్రమ రవాణాగా మార్చి ఆర్టీసీకి పోటీగా తిరిగేందుకు అవకాశం కల్పిస్తోందన్నారు. ఆర్టీసీల నిర్వహణఖర్చుకు ఆదాయానికి మధ్య ఉన్న తేడాను ప్రభుత్వాలు తిరిగి చెల్లించడం లేదన్నారు. నష్టాల పేరుతో ఆ భారాలను చార్జీలు, సెస్‌ల పెంపు పేరుతో ప్రజలపైనే రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్టీసీ బలోపేతానికి అంతకిభావంతో కృషి చేయాలని కోరారు. వీరాంజనేయులు, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్, సీఐటీయూ నాయకులు వెంకటేష్, బీఆర్‌టీయూ ఉపాధ్యక్షులు వేముల మారయ్య, భరత్, వెంకటేష్, పీ.ఆర్.రెడ్డి తదితరులున్నారు.

అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

కాచిగూడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం కాచిగూడలో అధికారులు, బీఆర్ఎస్ నేతలతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని వారికి సూచించారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ రాంబాబు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు భీష్మదేవ్, జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, తిరుపతి, వెంకటేష్, అదిత్య ఘోసే, దత్తాత్రేయ, విఘ్నేష్, నవీన్, నిశాంత్, ప్రణవ్, ప్రసన్న, రాహుల్, రమణమూర్తి, రమేష్, సంజీవ్, శైలజ, శ్రీకాంత్, శ్రీనివాస్, విశాల్ తదితరులున్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు

పార్కు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ముఠా జైసింహ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో అతిపెద్ద పార్కుల్లో ఒకటైన సుందరయ్య పార్కు అభివృద్ధి కోసం రూ.40 లక్షల నిధులు కేటాయించగా.. గత రెండు నెలలుగా పార్కులో గ్రీనరీ, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనుల పేరుతో మూసివేశారు. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ పార్కును సందర్శించారు. 10 రోజుల్లో పార్కు పనులను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నిరంజన్, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు మోజెస్, దామోదర్‌రెడ్డి, వెంకటకృష్ణ, కిషన్‌రావు, అహ్మద్ రఫీ ఖాన్, పార్కు మాజీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్వకేట్ తమిళ్‌రాజు, జనార్దన్ తదితరులున్నారు.

పాఠశాల స్వర్ణోత్సవం

కవాడిగూడ: క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఆర్‌కే గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ శివరామకృష్ణ విద్యార్థులకు సూచించారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలో ఎస్ఆర్‌కే గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అనుబంధ సంస్థ సురభి బాలవిహార్ పాఠశాల స్వర్ణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సైనిక విన్యాసాలు, శ్రీకృష్ణుడి చరిత్ర తదితర సామాజిక దృశ్యధాల వేషధారణతో నిర్వహించిన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు, రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సుజాత, సురభి బాలవిహార్ స్కూల్ కో-ఫౌండర్ ఉషావల్లి, సభ్యులు మూర్తి, ట్రాస్మా అధ్యక్షుడు యాదగిరి, శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, రాజశేఖర్‌రెడ్డి, భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ అధ్యక్షుడు నరేందర్‌కృష్ణ, బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సైనిక విన్యాసాలతో విద్యార్థులు

దశాబ్దాల విప్లవ సంస్కృతిక సేనాని డప్పు రమేష్



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎన్.వేణుగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నాలుగు దశాబ్దాల విప్లవ సంస్కృతిక సేనాని డప్పు రమేష్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జన నాట్య మండలి ఆధ్వర్యంలో డప్పు రమేష్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ ఖాసీంలు మాట్లాడుతూ.. జన నాట్య మండలి విప్లవ సంస్కృతిక కళాబృందంగా ఎంతో మందిని చైతన్య పరిచిందన్నారు. ప్రజా కళా బృందంగా మారడంలో డప్పు రమేష్ కీలక పాత్ర పోషించారన్నారు. తన కళానైపుణ్యంతో విప్లవ లక్ష్యాలను ప్రజలకు చేరవేయడంలో డప్పు రమేష్ కీలకపాత్ర పోషించారన్నారు. వారి చైతన్యం, లక్ష్యం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు పద్మకుమారి, జ్యోతి, కుల నిర్మూలన సంఘం నాయకులు రవి, పానీ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కార్ల్‌మార్క్స్ జీవితం ఆదర్శనీయం

నల్లకుంట: కార్మికులు, కర్షకుల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన కార్ల్‌మార్క్స్ జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గాడ్గేబాబా దళిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్ అపరాజిత్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట సంజీవయ్యనగర్‌లో కార్ల్‌మార్క్స్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తన నివాస భవనాన్ని అంబేడ్కర్ శతాబ్ది భవన్‌కు విరాళంగా ఇవ్వడంతో పాటు సొంత ఖర్చులతో 19 మంది దేశోద్ధారకుల విగ్రహాలను ప్రతిష్ఠించిన డాక్టర్ స్వామి అల్వాల్ అభినందనీయుడని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్కైలాబ్ బాబు కొనియాడారు. న్యూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు నర్సయ్య, సంపాదకులు ఎల్.ఎస్.రావు, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు గోపి, గాడ్గేబాబా దళిత సేవా సమితి మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల, ఏఐఎస్సీఆర్పీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభుదాస్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర కార్యదర్శి రాజేశం, అధికార ప్రతినిధి కేతూరి శేఖర్‌ప్రసాద్, యూత్ ప్రధాన కార్యదర్శి నర్సింహ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు రమేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి కృష్ణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కృష్ణ, మేడ్చల్ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గాడ్గేబాబా దళిత సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్

మహిళా బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి

కాచిగూడ: మహిళా బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. ఆదివారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పార్టీలు వాడుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా బిల్లుకోసం కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలే తగిన గుణపాఠం చెబుతారని అభిప్రాయపడ్డారు. భూషణ్ భాస్కర్, ప్రత్యూష, రాజు, లక్ష్మయ్యగౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌ను తప్పనిసరిగా నేర్చుకోవాలి



చిక్కడపల్లి: విద్యార్థులు ఇంగ్లిష్‌ను తప్పనిసరిగా నేర్చుకోవాలని దైవజ్ఞశర్మ అన్నారు. త్యాగరాయగానసభ కళాసుబ్బారావు కళావేదికలో ఆదివారం మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. అమ్మభాష తెలుగును మరవరాదని ఇంగ్లిష్‌ను కూడా నేర్చుకోవాలని సెంట్రల్ జోన్ ఏసీపీ రామదాస్‌తేజావత్ అన్నారు. వీవీఎల్ మాధవరావు, రేఖారావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

ఓసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు

కవాడిగూడ: బీఆర్ఎస్ పార్టీ 2018లో అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు, హుజురాబాద్ ఉపఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు అన్నారు. రెడ్డి, వైశ్య కులాల్లో పేదల సంక్షేమం కోసం ఇతర ఓసీ సామాజిక వర్గాల పేదల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలో ఆయన మాట్లాడుతూ.. తక్షణమే ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖను విలేకరుల సమావేశంలో వివరించారు. 8 ఏళ్ల పాలనలో ఓసీ సామాజిక వర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మరో 9 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చి ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ఓసీల్లోని ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విదేశాల్లో చదువుల కోసం రూ.20 లక్షల ఆర్థికసాయం అందజేయాలన్నారు. గురుకుల పాఠశాలలను సైతం ఏర్పాటు చేసి నిరుద్యోగుల భృతిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకంతో అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. రెడ్డి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఆర్యవైశ్య ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బుస్సా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశపతి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు



అంబర్‌పేట: ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన దేశపతి శ్రీనివాస్‌కు 1969 తెలంగాణ ఉద్యమకారులు ఉప్పు సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తొలిదశ మలిదశ తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ఈడీ విచారణకు సహకరించాలి

కాచిగూడ: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఈడీ చేత సమన్లు అందుకుని విచారణకు ఎందుకు హాజరు కావటం లేదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రశ్నించారు. ఈ కేసుతో ఆమెకు సంబంధం లేకపోతే ఎందుకు బయపడుతున్నారన్నారు. ఢిల్లీ లిక్కర్ మద్యం కేసులో ముద్దాయిగా ఉండి దేశంలో తెలంగాణ పరువు తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఈ కేసులో అనుమానితురాలుగా ఉండి ఈడీ విచారణను నిరోధించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై రాజకీయం చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో తెలంగాణ పౌర సమాజానికి ఎమ్మెల్సీ కవిత సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని పథకాలపై సీబీఐ చేత విచారణ జరిపించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

మాజీ హోంమంత్రికి సన్మానం

చిక్కడపల్లి: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ గ్రామంలో మాజీ హోంమంత్రి దేవేందర్‌గౌడ్ తన ఐదెకరాల స్థలంలో బీసీల కోసం బీసీ భవన్‌ను నిర్మించడం అభినందనీయమని ఆదర్శ స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకులు వంగాల బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. బీసీ భవన్ నిర్మిస్తున్న సందర్భాన్ని ఆదివారం దేవేందర్‌గౌడ్‌ను ఆదర్శ సంస్థల ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. క్లాం వీరస్వామి, ఎంఆర్ఎం.గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

టోర్నమెంట్స్‌తోనే యువతకు క్రీడాస్ఫూర్తి మెరుగు



అంబర్‌పేట: క్రీడా టోర్నమెంట్‌లు యువత మధ్య సత్సంబంధాలు, క్రీడాస్ఫూర్తిని నెలకొల్పుతాయని ప్రముఖ వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు కిరణ్‌రెడ్డి అన్నారు. భగత్‌సింగ్ యువజన క్రీడా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంబర్‌పేట మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత ఇతర రంగాలతో పాటు క్రీడారంగంలో ప్రావీణ్యత కలిగి ఉండాలన్నారు.

పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: అభ్యుదయభావాలకు ప్రతిరూపం మనిపల్లెరాజు సాహిత్యం అని ప్రముఖ సాహితీవేత్త వాడ్రేవు చిన వీరభద్రుడు అన్నారు. కథకుడిగా కొన్ని వర్గాల ప్రజల జీవితాలను వెలుగులోకి తెస్తే కవిగా ఉత్తమ కవులు బైరాగి, అజంతా, త్రిపుర వంటి వారితో సరిపోల్చదగిన వారు అవుతారన్నారు. త్యాగరాయగానసభలో ఆదివారం ప్రముఖ రచయిత సింహప్రసాద్‌కు మునిపల్లె రాజు సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

కాచిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేటర్ చైతన్య కన్నా అన్నారు. కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన సుగుణమ్మ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంది. ఆమెకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.15వేల చెక్కును ఆదివారం కాచిగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. బీఆర్ఎస్ నేతలు అశోక్‌రెడ్డి, మున్నా సింగ్, అంజమ్మ, సునిత, లక్ష్మి తదితరులున్నారు.

మేరు సంఘం నూతన కమిటీ

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గం మేరు కుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం అంబర్‌పేటలో తెలంగాణ మేరు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఆవిర్భవించింది. అధ్యక్షుడిగా సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్, కోశాధికారిగా శ్రీకాంత్, సలహాదారులుగా ఎం.మహేష్‌లు ఎన్నికయ్యారు. జేఏసీ కన్వీనర్ ఎం.రాము, కో- కన్వీనర్లు ఎస్.విష్ణు, సంతోష్, లీగల్ అడ్వైజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.